

## ఆన్‌లైన్ బెట్టింగ్‌తో జీవితాలు నాశనం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌పి వకుల్ జిందాల్ యువతకు సూచించారు. ఎవరైనా బెట్టింగులకు పాల్పడుతున్నట్లు తెలిస్తే సమాచారాన్ని డయల్ 112/100, 9121109483కు అందించాలని సూచించారు. ఈనెల 22 నుంచి ఐపిఎల్ మ్యాచ్‌లు ప్రారంభమైన నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలని, జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. బెట్టింగ్ యాప్‌ల వినియోగం వల్ల ఆర్థికంగా ఎక్కువగా నష్టం కలిగించి, సాఫీగా సాగిపోతున్న జీవితాలను నాశనం చేస్తాయన్నారు. చిన్న మొత్తాలతోప్రారంభించిన బెట్టింగులు, ఆశక్తి పెరిగే కొద్ది పెద్ద మొత్తంలో డబ్బులను బెట్టింగుకు పెట్టి, చివరకు ఆర్థికంగా పెద్ద మొత్తంలో నష్టపోతారన్నారు. బెట్టింగులతో డబ్బులను పోగొట్టుకొని మానసిక ఒత్తిడికి గురవుతారని, నిరాశ, ఆత్మన్యూనత భావాలతో చివరికి ఆత్మహత్యా ప్రయత్నాలకు దారితీస్తాయన్నారు. బెట్టింగులతో నిత్యం సమయాన్ని గడపడం వలన కుటుంబ సభ్యులు, స్నేహితులకు దూరం కావడమే కాకుండా, విలువైన సమయాన్ని వృథా చేస్తూ, అభివృద్ధికి దూరమవుతారని తెలిపారు.

# రూ.300 వేతనం రావాలి

- వేతనదారులు రెండు పూటలా పని చేయాలి : కలెక్టర్
- స్వయంగా గునపాం చేతబూనిన అంబేద్కర్
- కెరటాంలో ఫారంపాండ్ పనులు ప్రారంభం

వేతనదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, గునపాం పట్టి తవ్వుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-బొండపల్లి

జిల్లాలో ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే ప్రతి వేతనదారుడికి కనీసం రోజుకు రూ.300 వేతనం వచ్చేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. వేతనదారులు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో కనీసం ఆరు గంటలపాటు పనులు చేయడం ద్వారా వారికి రోజుకు రూ.300 కనీస వేతనం లభించేలా చూడొచ్చన్నారు. ఉపాధి వేతన దారులు ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు పనుల్లో పాల్గొనడం ద్వారా రోజుకు రూ.300 వేతనాన్ని పొందవచ్చని చెప్పారు.

వరల్డ్ వాటర్ డే సందర్భంగా జల సంరక్షణలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో రైతుల వ్యవసాయ భూముల్లో చేపట్టిన ఫారంపాండ్ల నిర్మాణాలను కలెక్టర్ శనివారం బొండపల్లి మండలం కెరటాంలో ప్రారంభించారు. కెరటాంలో చింతపల్లి సూర్యనారాయణ అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాల మామిడితోటలో పంటకుంటలు(ఫారంపాండ్) తవ్వే పనులను కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ గునపం చేతబూని మట్టి తవ్వి పంటకుంటలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడిన కలెక్టర్‌కు తమకు సగటున రూ.250 వరకు వేతనం అందుతోందని వేతనదారులు వివరించారు. పంటకుంట తవ్వేందుకు ఎంత మొత్తంలో ఉపాధినిధులు ఖర్చు చేస్తున్నదీ కలెక్టర్ తెలుసుకున్నారు. రూ.23 వేలతో ఇక్కడ పంటకుంట ఏర్పాటుకు ధులు మంజూరు చేయడం జరిగిందని ఎపిఒ కృష్ణవేణి వివరించారు. అనంతరం అదే గ్రామంలో గణరాజు లక్ష్మణరావుకు చెందిన కొబ్బరితోటలో తవ్విన పంటకుంటను కలెక్టర్ పరిశీలించారు. అక్కడ వేతనదారులతో, భూ యజమానితో మాట్లాడారు. ఇక్కడ పంటకుంట ఏర్పాటుకు రూ.60,979 మంజూరయ్యాయని, గత ఆరురోజులుగా ఇక్కడ పనిచేస్తున్నట్టు వేతనదారులు చెప్పారు.

ఈనెలలో 3215 పంటకుంటలను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు డ్వామా పీడీ తెలిపారు. జిల్లాలో శనివారం నాడు 731 పంటకుంటల నిర్మాణం పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిపిఒ టి.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నంబూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి పెద్దపీట

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మండలంలో గొట్లాం సచివాలయ ఆవరణలో శనివారం వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే అన్నదాతలను ఆదుకునేందుకు కోట్లాది రూపాయలు వ్యయంతో పనిముట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని గుర్తుచేశారు. రైతుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేసి, ఉత్తరాంధ్ర సృజల స్రవంతిని సహకారం చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు, ఎడి ఎకె.మహారాజన్, తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, ఎఒ మల్లికార్జునరావు, ఎంపిడిఒ జి.గిరిబాల, టిడిపి మండల అధ్యక్షులు కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరనాయుడు, సర్పంచులు నంబూరి రాజేష్, ముదునూరు శ్రీనివాసరాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు బాలాజీ, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, సీనియర్ నాయకులు పి.వి.వి.గోపాలరాజు, బుద్దరాజు సత్యనారాయణ రాజు, చింతలపాటి శ్రీనివాసరాజు, ఉప్పలపాటి చిరంజీవి రాజు, మాజీ సర్పంచ్ తాళ్లపూడి రమణ, ముంజేటి పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

### సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**గంట్యాడ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం గంట్యాడలో అందజేశారు. నియోజకవర్గ పరిధిలో 8 మందికి మంజూరైన రూ.9.72 లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ సహాయం కోసం ఎదురుచూస్తున్న అనేకమందికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆసరాగా మారిందన్నారు.

## చెక్‌పోస్టు వద్ద రైతులు, డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి-వేపాడ

పొలాలకు మట్టి తరలించేందుకు అధికారినంటూ అడ్డుపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బొద్దాం చెక్‌పోస్టు వద్ద రైతులు, జెసిబి, ట్రాక్టర్ డ్రైవర్లు శనివారం నిరసన చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా జెసిబిలు, ట్రాక్టర్లు పెట్టి, అక్కడే బైఠాయించారు. జీపుపై వచ్చిన వ్యక్తి రూ.25 వేలు ఇస్తే తప్ప మట్టి తరలించడానికి వీల్లేదని బెదిరిస్తున్నారని రైతులు వాపోయారు. క్వారీ వద్ద మట్టి తెచ్చుకోనీవ్వడం లేదని, పొలానికి మట్టి తరలించనివ్వడం లేదని మండిపడ్డారు.

చెక్‌పోస్ట్ వద్ద బైఠాయించిన రైతులు, డ్రైవర్లు

జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి

## ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలు

### సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ.. పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బొబ్బిలి పట్టణంలోని లోకబందు రెసిడెన్సీలో శనివారం సిపిఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ముందుగా సిపిఎం జెండాను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు కాకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో నష్టపోతున్నారని తెలిపారు. అన్ని రంగాల సమస్యలపై పోరాటం చేయాలని సిపిఎం శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం

**ఎర్ర చెరువు వద్ద భవనాల తొలగింపు అంశం తిరస్కరణ ● రెవెన్యూ అధికారులకు నివేదించాలని కౌన్సిల్ సూచన**

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం సాదాసీతాగా జరిగింది. సమావేశంలో 26 అంశాలను, 14 అనుబంధ అంశాలను పొందుపరిచారు. సాధారణ సమావేశంలోని అజెండా అంశాలలో రెండు మినహా మిగిలిన అన్నింటికీ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశానికి ముందు ఇటీవల మృతి చెందిన 34వ డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజు, మాజీ కౌన్సిలర్ మేకా కాశీ విశ్వేశ్వరుడు అకాల మరణానికి సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, కోఆప్షన్ సభ్యులు ఆశపు వేణు మాట్లాడుతూ మృతి చెందిన సభ్యుల సేవలను కొనియాడారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ డివిజన్‌లో చేపట్టే వివిధ పనుల్లో కార్పొరేటర్ల సూచనలను, సలహాలను పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన అంశాలపైసభ్యులు చర్చించారు. తదుపరి రెండు అంశాలు మినహా మిగిలిన అన్ని అంశాలకు ఆమోదం తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన భవన నిర్మాణాల నిబంధనల వివరాలను అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు సభ్యులకు వివరించారు.

మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

ఎజెండాలోని ఎర్ర చెరువు వద్ద ఉన్న ఇళ్లను తొలగించాలని పెట్టిన అంశాన్ని కౌన్సిల్ వాయిదా వేసింది. 25 ఏళ్లుగా పట్టాలు పొంది, ఇళ్లు కట్టుకొని జీవిస్తున్న వారిని చెరువు ఆక్రమణల పేరుతో తొలగించాలనే అంశాన్ని కౌన్సిల్ సమావేశం తిరస్కరించింది. ఆర్‌డిఒకు ప్రభుత్వ ఆదేశాలను పంపించిన తర్వాత వచ్చిన నివేదిక ఆధారంగా కౌన్సిల్ నిర్ణయం మేరకు చర్యలు తీసుకోవాలని అంతవరకు అంశాన్ని వాయిదా వేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. నగరంలో పన్నులు వసూలు ప్రక్రియ బలవంతంగా చేయడం తగదని, మొండి బకాయిలు సమయం ఇచ్చి విడతల వారీ వసూలు చేయించాలని 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి పద్మావతి తెలిపారు. మరో వైపు 70, 80 గజాల్లో పేదలు ఇళ్లలు కట్టుకుంటే సచివాలయం సిబ్బంది వచ్చి ఇబ్బంది పెడుతున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే కమిషనర్‌ను కలవండి అని చెప్పడం విడ్డూరంగా ఉందని కార్పొరేటర్ మారోతు శ్రీనివాసరావు అన్నారు. కొత్త పేట నుంచి మూడు లాంతర్లు వైపు అభివృద్ధి చేసిన రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలని కార్పొరేటర్ అల్లు చాణక్య కోరారు. ఆప్కాస్‌లో బినామీ వర్కర్లు 50 మంది పేర్లు నమోదు చేశారని, ఆ వివరాలు వెల్లడిచాలని ఫ్లోర్ లీడర్ రాజేష్ అధికారులను కోరారు. మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసేందుకు అందరి సహకారం అవసరమన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కే అప్పలరాజు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై సోలార్ కెమెరాలు

ప్రజాశక్తి- డెంకాడ

సోలార్ కెమెరాలను బిగిస్తున్న సిబ్బంది

మూడు జిల్లాల రహదారులు కనిపించేటట్టు నేషనల్ హైవేలపై సోలార్ కెమెరాలను పోలీసులు శనివారం ఏర్పాటు చేశారు. డెంకాడ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం మూడు జిల్లాల జాతీయ రహదారులు ఉండడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో గత నెలలో జిల్లా ఎస్‌పి వకీల్ జిందాల్ మండల పరిధిలో ఉన్న నేషనల్ హైవే రహదారులను పరిశీలించి ప్రమాదాలు జరుగు స్థలాలను గుర్తించి అక్కడ బ్లాక్ స్పాట్లుగా ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించడంతో స్థానిక ఎస్ఐ ఏ సన్యాసినాయుడు జాతీయ రహదారులపై సోలార్‌తో పనిచేసే ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణకు డివైడర్స్ లైటింగ్ జిగ్ జాగ్ సర్వీస్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నామని, మూడు జిల్లాల రహదారులు కనిపించేలా ఐదు సోలార్ సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రామాల వద్ద పాదచారులు రహదారి దాటే క్రమంలో ప్రమాదలు ఎక్కువగా జరుగుతున్నాయని వీటిని నివారించేందుకు చెర్రీలు చేపట్టామన్నారు. ఈ ప్రాంతాల్లో సెంటర్ డివైడర్‌పై రైలింగ్ వేయించామన్నారు. లైటింగ్ సరిగా లేకపోవడంతో ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని గుర్తించి ఆ ప్రాంతంలో లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు.

## సంస్కృతం పరీక్షకు 99.88 శాతం హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో శనివారం 33 కేంద్రాల్లో జరిగిన పదో తరగతి సంస్కృతం పరీక్షకు 99.88 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 33 కేంద్రాల్లో పరీక్షకు మొత్తం విద్యార్థులు 1703 మంది హాజరు కావాల్సి ఉండగా, 1701 మంది హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు హాజరు కాలేదు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డిఇఒ మాణిక్యంనాయుడు తెలిపారు.

## 92 కిలోల గంజాయి సీజ్

- పోలీసుల అదుపులో నిందితులు
- జిఆర్‌పి సిఐ రవికుమార్

ప్రజాశక్తి-విజయనగరంకోట

శృంగవరపుకోట రైల్వేస్టేషన్‌లో జిఆర్‌పి సిఐ రవికుమార్ ఆధ్వర్యాన ఎస్.బాలాజీరావు, సిబ్బంది చేపట్టిన తనిఖీల్లో 92కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు శనివారం జిఆర్‌పి స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివవరాలను సిఐ రవికుమార్ తెలిపారు. ఎస్.కోట రైల్వేస్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా నలుగురు నిందితుల నుంచి 61కిలోల గంజాయిని పట్టుకున్నారు. విజయనగరం రైల్వే స్టేషన్లో తనిఖీ చేస్తుండగా 31 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ రెండు కేసుల్లో మొత్తం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించామని చెప్పారు. ఢిల్లీ,ముంబై, హైదరాబాద్ చెందిన నిందితులుగా గుర్తించినట్లు సిఐ రవికుమార్ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో జిఆర్‌పి సిఐ బాలాజీరావు

కార్యక్రమంలో విజయనగరం రైల్వే స్టేషన్ ఎస్ఐ వి.బాలాజీ రావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్

**విజయనగరంకోట :** పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పొందిన 18 మంది పోలీసు కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ శనివారం ఘనంగా జరిగింది. 9 నెలల ప్రాథమిక చికిత్స అనంతరం జరిగిన పాసింగ్ అవుట్ పెరేడ్‌కు ముఖ్యఅతిగా నాసిన్ జనరల్ అడిషనల్ డైరెక్టర్ ఇ.రవికిరణ్ , ప్రిన్సిపల్ డి.రామచంద్రరాజు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శిక్షణ పొందిన వారితో ప్రమాణం చేయించారు. నిజాయితీతో ప్రజలకు సేవ చేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణముగా సమాజములో నెలకొంటున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విధి నిర్వాహణలో సవాళ్లను ధీటుగా ఎదుర్కోవడానికి నూతన పంథాలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పివి అప్పారావు, డిఎస్‌పిలు పి.శ్రీకాంత్, టి.రమేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, మెడికల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, ఎఒ టి.భవాని తదితరులు పాల్గొన్నారు.

## టిబి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేద్దాం

**డిఎంహెచ్ఒ, టిబి కంట్రోల్ అధికారి పిలుపు**

ప్రజాశక్తి-విజయనగరంకోట

క్షయరహిత జిల్లాగా మార్చేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి, క్షయ నియంత్రణాధికారి డాక్టర్ కె.రాణి పిలుపునిచ్చారు. స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిఎంహెచ్ఒ మాట్లాడుతూ, టిబిని అంతం చేయగలమన్న నినాదంతో ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా టిబి వ్యాధిపై అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. 2025 నాటికి టిబి వ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. జిల్లాను 10 టిబి యూనిట్లుగా వివరించి, వ్యాధి నిర్మూలకు చర్యలు చేపట్టామని అన్నారు. రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, కఫంలో రక్తపు జీరలు, రాత్రిపూట చెమట పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసటగా ఉండటం, మెడవద్ద వాపు తదితర లక్షణాలు ఉంటే టిబి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డిసెంబరు 7న ప్రారంభించిన 100 రోజుల టిబి కార్యక్రమంలో 861 క్షయ కేసులను గుర్తించామని తెలిపారు. జిల్లా క్షయ నివారణాధికారి రాణి మాట్లాడుతూ, టిబి రోగులు వ్యాధినుంచి వేగంగా బయటపడాలంటే వ్యక్తిగత కృషితోపాటు, సామాజికంగా నైతిక సహకారం కూడా అవసరం అన్నారు. వైద్యులు సూచించిన మేరకు మందులు వాడుతూ, తగిన జాగ్రత్తలను తీసుకొంటే ఆరు నెలల్లోనే టిబిని నయం చేయవచ్చునని చెప్పారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ అంబేద్కర్, డిఎంహెచ్ఒ, టిబి నివారణ అధికారితో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ సూర్యనారాయణ పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తి రవి రాక

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ చీమలపాటి రవి శనివారం జిల్లాకువచ్చారు. జిల్లా కోర్టులో జరిగిన న్యాయాధికారుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి రవిని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి సాయికల్యాణ్ చక్రవర్తి కూడా వున్నారు.

## పిఎం ఇంటర్న్ షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్

**విజయనగరం :** ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ కార్యక్రమానికి నిరుద్యోగ యువత ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది ఆపై తరగతులు ఉత్తీర్ణులు అయిన వారంతా ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 550 పరిశ్రమలో వీరికి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఏడాదిపాటు ఉండే ఈ శిక్షణా కాలంలో నెలకు రూ.6వేలు చొప్పున స్టయిఫండ్ అందజేస్తారన్నారు. జిల్లా నైపుణ్య అధికారి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, యువత నైపుణ్యాన్ని పెంచేందుకు, ఉపాధి కల్పించేందుకు జిల్లాలో తీసుకున్న చర్యలను వివరించారు.

# రీసర్వేల్లో తప్పులు.. రెవెన్యూకు కాసులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

బహుశా వారి భాషలో సంపద సృష్టించుకోవమంటే ఇదేనేమో..! తప్పులు చేసిందీ వారే, ప్రజలకు తిప్పలు పెట్టించిందీవారే. చివరికి కాసుల వర్షం కురిపించుకుంటున్నదీ వారే. ప్రభుత్వం ఇక్కడ ప్రేక్షక పాత్ర పోషించడంతో భూ యజమానుల ఆవేదనలు, ఆక్రందనలు అన్నీ ఇన్నీ కావు. తాత తండ్రుల నాటి భూములు, కష్టపడి సంపాదించుకున్న భూములు రక్షించుకోవానికి రెవెన్యూ కార్యాయాల చుట్టూ తిరుగుతున్నవారు కొందరైతే, ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగాలే తిరిగి తిరిగి జుమాయించుకుపోయినవారు మరికొందరు. మొత్తానికి ఆ భూముల వివరాలు ఆన్‌లైన్ పేరిట 2014 -19 మధ్య అప్పటి టిడిపి ప్రభుత్వం చేపట్టిన వెబ్ ల్యాండ్ మొదలుకుని 2019 తరువాత నిర్వహించిన జగనన్న భూ సురక్ష - శాశ్వత భూహక్కు పేరిట సర్వే, తాజాగా కూటమి ప్రభుత్వం దానికి కొనసాగింపుగా చేస్తున్న రీసర్వే అన్నీ ఒక్కటే. ముఖ్యంగా గత ప్రభుత్వం, నేటి ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలు సరాసరి ఒక్కటే. కాకపోతే, గతంలో పాతిన సరిహద్దు రాళ్లపై అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డి తన పేరు రాయించుకోవడంతోపాటు ఫోటో ముద్ర కూడా వేయించుకున్నారు. నేటి ప్రభుత్వం ఆ పేర్లను, ఫోటోలను చెరిపివేసే కార్యక్రమం చేపట్టింది. కాస్త అటు ఇటుగా ఉన్నా నాటి రాతలు, ముద్రలు, ప్రస్తుతం వాటి చెరిపివేతకు చేసిన, చేస్తున్న ఖర్చు మాత్రం రూ.కోట్లలోనే. ఇదంతా ప్రజాధనమే. ఈ సంగతి కాస్త అటుంచితే, నాటి టిడిపి ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ స్వల్ప సమయంలో వెబ్‌ల్యాండ్ పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులు, సిబ్బంది మెడపై కత్తిపెట్టింది. ఈ ఒత్తిడి నుంచి బయటపడేందుకు విఆర్ఒ స్థాయిలో రెవెన్యూ సహాయకులు లేదా గ్రామంలోని బాగా తెలిసిన వ్యక్తులను పక్కన బెటటుకొని ఇష్టారాజ్యంగా, తప్పుల తడకగా నమోదు చేశారు. దీంతో, ఒకరి భూమి ఒకరికి, సెంటు భూమి లేనివారికి పదులు, వందల ఎకరాలు ఉన్నట్లు, తాతతండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములు సెంటు భూమి లేనట్టు నమోదయ్యాయి. మారిన పరిస్థితులను బట్టి కనీసం బ్యాంకులో వ్యవసాయ రుణం పొందాలన్నా పూర్వకాలంలో ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకం కన్నా ఆన్‌లైన్‌లోవున్న 1బిలకే విలువ ఎక్కువైంది. దీంతో, ముఖ్యంగా రైతులు వ్యవసాయ రుణాలు పొందలేని పరిస్థితి. భూ క్రయ, విక్రయాలకు తీవ్రమైన ఆటంకం ఏర్పడింది. ఏకంగా రిజిస్ట్రేషన్లే నిలిచిపోయే పరిస్థితి. వాటిని సరిచేయాలంటే తిరిగి విఆర్ఒ మొదలుకుని ఆర్ఐ,

తహశీల్దార్ సంతకాలతో కూడిన అప్రూవల్ చేయాలి. పొరపాటు, తప్పులు సహజం. ఈ మాటకొస్తే ప్రతి తప్పును లేదా పొరపాట్లను సరిచేసుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. ఇందుకు అనుగుణంగా వెబ్‌ల్యాండ్‌లో దొర్లిన తప్పుల సరిచేసే అవకాశం, బాధ్యత కూడా ప్రభుత్వం కల్పించింది. కానీ, ఇక్కడ తప్పులు, పొరపాట్లుచేసిన విఆర్ఒ లేదా ఇతర సిబ్బంది, అధికారులే వాటిని మరింత జఠిలం చేసి మరీ భూ యజమానుల్ని ముప్పు తిప్పలు పెడుతున్నారు. మ్యుటేషన్ పెట్టాలంటే డబ్బు, వాటిని అప్రూవల్ చేయాలంటే డబ్బులు, మధ్యలో ఆ ఫైల్ ఆన్‌లైన్‌లో కదలాలంటే డబ్బు ఇవ్వాల్సిందే. ఇలా రోజులు, నెలలు, ఏళ్లు గడిచినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో జనం డబ్బులు ఇవ్వడానికి కూడా అలవాటుపడిపోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇది చాలదన్నట్టు గత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగనన్న సమగ్ర భూ రక్ష పేరిట రీసర్వే చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 984 రెవెన్యూ గ్రామాలు ఉండగా, వీటిలో 502 గ్రామాల్లో రీసర్వే చేపట్టింది. వీటిలో సుమారు 100 గ్రామాల్లో సర్వే అసంపూర్తిగా ఉంది. ఇందులో మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. అన్నదమ్ములకు ఉమ్మడి ల్యాండ్ పార్మిల్ మెంబర్లను ఇచ్చేశారు. ఫలితంగా ఆన్‌లైన్‌లో 1బి లు రావడం లేదు. వీటిని విడదీయాలంటే ఆర్‌డిఒ లేదా జెసి లాగిన్ వరకు వెళాల్సివుంటుంది. ఇందుకోసం రూ.550 ప్రభుత్వానికి చలానా తీయాలి. ఎన్ని ఎల్‌పిఎం విడదీయాలంటే అన్ని రూ.550 చొప్పున ఇవ్వాల్సిందే. అనధికారంగా వేలాది రూపాయలు దండు కుంటున్నారు. సరిహద్దు సమస్యలు ముందుకు వచ్చాయి. విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉత్పన్న మయ్యాయి. గ్రామాల్లో లేనివారి పేర్లు కూడా రికార్డుల్లోకి వచ్చాయి. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తామంటూ గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహించి, ఫిర్యాదులు స్వీకరించినప్పటికీ అందులో చిత్తశుద్ధి నేతి బీరకాయలో నెయ్యి చందంగానే ఉంటోంది. ఇది చాలదన్నట్టు కూటమి ప్రభుత్వం కూడా జగనన్న మాదిరిగానే రీసర్వే చేపట్టింది. 27 గ్రామాలకు గాను ఇప్పటి వరకు 21 గ్రామాల్లో తొలిదశ సర్వే పూర్తచేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఈనెల 15 నుంచి మలిదశ సర్వే మొదలు పెట్టారు. ఇందులో గతంలో సర్వేచేసిన గ్రామాలను పక్కనబెట్టామని అధికారులు చెబుతున్నారు. మరి ఆ సమస్యలను ఎవరు పరిష్కరిస్తారు? కొత్తగా చేపట్టిన సర్వే కూడా పాత సీసాలో కొత్తసారా మాదిరిగానే ఉంది. దీంతో, ప్రజలు తమ భూములు కాపాడుకోవాలంటే రెవెన్యూ సిబ్బంది, అధికారుల చేతులు తడిపాల్సిందే అంటూ పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.

## ఎస్.కోటలో నేడు మెగా జాబ్‌మేళా

**శృంగవరపుకోట :** పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సంకల్ప్ మెగా జాబ్ మేళాకు వివిధ కంపెనీలు ఈ మేళాకి వస్తున్నాయని, నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. జాబ్‌మేళాకు విశాఖ ఎంపి శ్రీభరత్ హాజరవుతారని చెప్పారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

**రేగిడి :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పోషణ బి నేషనల్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం అంగన్వాడి కార్యకర్తలకు అంగన్వాడి సూపర్వైజర్లు జి.జానకి, జి.సుజాత, సిహెచ్. నూకాలమ్మ, జి.అమ్మనమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషణ బి, పడాయి బి శిక్షణలో నేర్చుకున్న విషయాలు కేంద్రాలలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అమలు పరచాలన్నారు. అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు.

## డిపోలో డిపిటిఒ తనిఖీ

**శృంగవరపుకోట :** శృంగవరపుకోట ఆర్‌టిసి డిపోలో జిల్లా ప్రజా రవాణాధికారి సిహెచ్.అప్పలనారాయణ శనివారం తనిఖీలు చేపట్టారు. డిపోలో అన్ని సెక్షన్లు, బస్‌స్టేషన్, పార్శిల్ కౌంటర్ తనిఖీ చేశారు. వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యం కోసం బస్‌స్టేషన్‌లో చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.రమేష్, అసిస్టెంట్ మేనేజర్ కృష్ణారావు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయపై అవగాహన ర్యాలీ

**కొత్తవలస :** వియ్యంపేట సచివాలయ పరిధిలోని కోటానివానిపాలెంలో శనివారం పిహెచ్‌సి వైద్య సిబ్బంది క్షయపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఉపాధి హామీ కూలీలకు ఫీల్డ్‌అసిస్టెంట్ నూకరాజు ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఒ నరసింహరావు, హెచ్‌ఎస్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎఎన్‌ఎం భవాని, ఆశావర్కర్ వరలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సారా నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

సారా నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. మండలంలోని కొయ్యకొండవలసలో శనివారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటుసారా వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నాటుసారా తాగితే ఆరోగ్యం పాడైపోతుందని, దూరంగా ఉండాలని కోరారు. నాటుసారాతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పట్టపగలే విద్యుత్తు వెలుగులు

**సంతకవిటి :** మండలంలోని బొద్దూరు గ్రామంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఈ విద్యుత్ దీపాలు అధికారుల పర్యవేక్షణ కరువై నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్తు వృథా అవుతుందని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. తక్షణమే మండల విద్యుత్ శాఖ అధికారుల స్పందించి, ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు

**వేపాడ:** మండలంలోని జాకేరు మీదుగా బక్కునాయుడుపేట వరకు ఉన్న రహదారికి మరమ్మతులు చేపట్టేందుకు ఆర్‌అండ్‌బి అధికారులు అంచనాలు రూపొందించారు. బడిబస్సు నడిపేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఇచ్చిన వినతిపై కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఆర్‌అండ్‌బి అధికారి స్వామి క్షేత్రస్థాయిలో రోడ్డును పరిశీలించి, చేపట్టాల్సిన మరమ్మతులను గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**వేపాడ :** మండలంలోని అరిగిపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గ్రామసభలో సర్పంచ్ దుల్ల లక్ష్మి, నాయకులు సన్యాసినాయుడు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి టి.వెంకటరమణ, మాజీ సర్పంచ్ దుల్ల వెంకటరమణ, మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

## 25న వంగర మండల సమావేశం

**వంగర :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 25న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ లోపింటి త్రినాధరావు శనివారం తెలిపారు. ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన జరగబోయే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

## పి4 సర్వే పై సచివాలయాల్లో సభలు

**విజయనగరం టౌన్ :** నగరంలో అన్ని సచివాలయాల పరిధిలో పి.4 విధానంపై సచివాలయాల కార్యదర్శులు వార్డు సభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాటాక్లడుతూ ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యంతో పి4 సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ప్రవాస ఆంధ్రులు, సంపన్న కుటుంబాల వారు అత్యంత వెనుకబడ్డ కుటుంబాలకు సహాయం చేయడానికి ఉద్దేశించిన కార్యక్రమమని తెలిపారు.

## అన్నదాన సత్రం పరిశీలన

**రేగిడి :** మండలంలోని వావిలవలస గ్రామంలో రాహుల్ సౌరబ్ నిత్యాన్నదాన సత్రాన్ని టిటిడి ప్రధాన అర్చకులు గోవిందస్వామి దీక్షితులు, అతని కుమారుడు బాలాజీ దీక్షితులు శనివారం పరిశీలించారు. రాహుల్ సౌరబ్ నిత్య అన్నదాన సత్రం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏడేళ్లగా వృద్ధులు, వికలాంగులను ఆదుకుంటున్న సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థను అభినందించారు. తన వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం వావిలవలస గ్రామంలో వెలసిన శ్రీ రంగనాథ స్వామి ఆలయాన్ని గోవిందస్వామి దీక్షితులు, బాలాజీ దీక్షితులు పరిశీలించారు.

## ఆశీల వేలం వాయిదా

**నెల్లిమర్ల :** నగర పంచాయతీకి సంబంధించి 2025-26 సంవత్సరానికి గాను రోజు వారి రోడ్డు మార్జిన్, మార్కెట్ ఆశీలు చేసుకునే హక్కును లీజుకు ఇవ్వడానికి శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఎవరూ పాల్గొనకపోవడంతో ఈ నెల 24న సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు బహిరంగం వేలం పాటను నిర్వహిస్తామని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## నగర పంచాయతీలో వార్డు సభలు

**నెల్లిమర్ల :** నగర పంచాయతీలో పి4 సర్వేపై శనివారం వార్డు సభలను నిర్వహించారు. అగురు వీధి, ఇందిరా కాలనీ, పద్మశాలి వీధి 3,4,5 సచివాలయాల పరిధిలో వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ మాట్లాడుతూ సమాజంలోని కుటుంబాలు ఒకరికొకరు సహాయం చేసుకునే విధంగా ఒక స్వయం - నిర్వహణ సామర్థ్యం కలిగిన వ్యవస్థను నిర్మించడానికి సర్వే సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్స్, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది, సంబందిత వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఉల్లాస్ ప్రశ్నపత్రాలు అందజేత

**బొబ్బిలి :** మండలంలో ఉల్లాస్ పరీక్ష నిర్వహణకు ప్రశ్నపత్రాలను శనివారం అంగన్వాడీలకు ఎంపిడిఒ రవికుమార్, ఎంఇఒ లక్ష్మణరావు, ఎపిఎం భాగ్యలక్ష్మి అందజేశారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి, ప్రశ్నపత్రాలను ఐసిడిఎస్ పిఒ విజయలక్ష్మి సమక్షంలో అందజేశారు.

## మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**బాడంగి :** మండలంలోని కోటిపల్లి గ్రామంలో శనివారం అక్రమంగా మద్యం తరలిస్తున్న పెంటపల్లి శ్రీను అనే వ్యక్తి ఎస్ఐ తారకేశ్వరరావు అరెస్టు చేశారు. అయన్నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ఘనంగా జల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాలలో శనివారం భూ విజ్ఞాన శాస్త్రం విభాగం, విజయనగరం భూ గర్భ జల విభాగం, జల గణన విభాగం సంయుక్తంగా ఘనంగా ప్రపంచ జల దినోత్సవం నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించాఉ. కళాశాల నుండి కోటచ గంటస్తంభం మీదుగా తిరిగి కళాశాలకు చేరుకుంది. ఈ ర్యాలీలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సిసి, సెట్విజ్ , నెహ్రూ యువ కేంద్రం సభ్యులు పాల్గొన్నారు. భూ జల వనరులు శాఖ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం భూగర్భ జలాలు ఇంకిపోతున్నందున ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు తవ్వుకొని నీటిని సమృద్ధిగా కాపాడుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భూ విజ్ఞాన శాస్త్రం విభాగ అధిపతి డాక్టర్ ఎం గణపతి రావు, సహాయ ఆచార్యులు టి శంకర్రావు, కె.సత్యనారాయణ నాయుడు, కన్వీనర్లు బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

**'సీతం'లో ప్రపంచ జల దినోత్సవ వేడుకలు**

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ప్రపంచ జల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది థీమ్ 'హిమనీనదాలు సంరక్షణ - స్థిరమైన జల భవిష్యత్తు"పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ యడ్ల గోవిందరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాజా నీటి వనరుల్లో హిమనీనదాలు కీలక భూమిక వహిస్తున్నాయని, వాటి పరిరక్షణ కోసం కృషి చేయాలనికోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డివి రామమూర్తి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ నీటి సంరక్షణ అనేది భవిష్యత్ తరాల కోసం అత్యంత అవసరమని తెలిపారు.

**బైరిసాగరానికి జల హారతి**

**బొబ్బిలి :** బొబ్బిలి యుద్ధ స్తంభం వద్దనున్న బైరిసాగరం చెరువుకు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు జల హారతినిచ్చారు. ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమాన్ని బైరిసాగరం చెరువులో నిర్వహించారు. ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు జాగరపు ఈశ్వర్ ప్రసాద్, ప్రధానకార్యదర్శి గవిరెడ్డి రఘు చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

**నీరే ప్రాణకోటికి జీవనాధారం**

**మెంటాడ :** నీరే ప్రాణకోటికి జీవనాధారామని ఎంపిడిఒ భానుమూర్తి వెల్లడించారు. లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో మెంటాడలోని గాయత్రి విద్యానికేతన్‌లో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి వనరులు కాపాడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను నివారించొచ్చని చెప్పారు. భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. పిహెచ్‌సి వైద్యాధికారి కల్పన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ కనీస అవసరాలకు రోజుకు 55 లీటర్ల నీరు అవసరమని చెప్పారు. లెప్రా సొసైటీ కోఆర్డినేటర్ లెంక రమణ మాట్లాడుతూ నీటి వనరుల ఉపయోగం, జలవనరుల సంరక్షణ పద్ధతులపై వివరించారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు హెచ్‌ఎం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ధనలక్ష్మి, కె.హైమ, గాయత్రి విద్యానికేతన్ ప్రిన్సిపల్ నారాయణరావు, వైద్యులు జ్యోతి, సూపర్‌వైజర్ పి.వి రమణ, లెప్రా సొసైటీ సిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ పి.నల్లనయ్య

## మిల్లులో ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జ్యూట్‌మిల్లులో ఉత్పత్తి పనులు చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చర్యలు తీసుకోవాలని జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ లేబర్ కమిషనర్ వద్ద జరిగిన చర్చల్లో జ్యూట్ యాజమాన్యం మిల్లు తిప్పడానికి అంగీకరించి మెయింటేనెన్స్ పనులు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఉత్పత్తి ప్రారంభించలేదన్నారు. విద్యుత్ బిల్ కట్టకపోవడంతో మిల్లు తిరగడం లేదని, యాజన్యాన్ని అడిగితే బిల్లు కట్టామని చెబుతున్న నేపథ్యంలో ఎలక్ట్రికల్ ఎఇని ప్రశ్నిస్తే జ్యూట్ యాజమాన్యం బిల్లు చెల్లించలేదని ఒక వేల బిల్లు కడితే తనకు సమాచారం వస్తుందని చెప్పారన్నారు. ఇప్పటికే మిల్లు మూతబడి సుమారు 10 నెలలు గడిచి కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు మెయింటేనన్స్ పేరిట కాలయాపన చేసి మిల్లులో ఉన్న లక్షలాది రూపాయలు సరుకును బయటకు తరలించే కుట్రకు పాల్పడితుందని ఆరోపించారు. ఇలా అయితే మరోసారి కార్మికుల ఉద్యమం చేపట్టి 1994 కాల్పులు పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి మిల్లు ఉత్పత్తికి చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్మికులు కె.పద్మనాభం, ఎస్.సూర్యారావు తదితరులు ఉన్నారు.

# గ్రామస్తులతో హైకోర్టు న్యాయమూర్తి మాటామంతీ

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవికుమార్ శనివారం సాయంత్రం తన స్వగ్రామం బైరిపురం వచ్చారు. తన తండ్రి చీమలపాటి శ్రీరామమూర్తి, సోదరుడు శేఖర్‌తో కలసి బైరిపురం గ్రామంలో ఉన్న తన నివాసానికి చేరుకుని గ్రామస్తులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు విజయనగరం వచ్చినా తన సొంత ఊరును మరచి పోకూడదనే తలంపుతో ఏ సమయమైనా అలా ఒక్క క్షణం వచ్చి అందరిని ఆప్యాయంగా పలకరించి వెళ తంటానని చెప్పారు. అందరు మంచిగా ఉండాలని, అందరికీ మంచి చేయాలి, తోటివారికి సహాయ పడాలి, జన్మనిచ్చిన తల్లి తండ్రులను మరచి పోకూడదని చెప్పారు. ఆయన వెంట జిల్లా జడ్జి కల్యాణ చక్రవర్తి, చీపురుపల్లి సిఐ శంకరరావు, బుధరాయవలస ఎస్ఐ లోకేష్‌కుమార్, గ్రామ పెద్దలు పప్పల గృహనేశ్వరరావు, కందుల మల్లికార్జునరావు, సింగారపు రామకృష్ణ, పప్పల క్రిష్ణమూర్తి, కందుల శ్రీనివాసరావు, కెంగువ ధనంజయ తదితరులు ఉన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి రవికుమార్

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పవన్ కృషి

ప్రజాశక్తి - గుర్ల

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. గతంలో డయేరియా బారినపడి పదిమంది మృతి చెందిన సంఘటన తెలిసిందే. వారి కుటుంబాలకు శనివారం గుర్లలో రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు బాధితులను పరామర్శించడానికి వచ్చిన పవన్ కళ్యాణ్ మృతుల కుటుంబాలకు లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని గుర్తు చేశారు. మాట తప్పకుండా వారి కుటుంబాలకు చెక్కులు అందజేశామని అన్నారు. ఈ రాష్ట్రంలో అనేక ఇబ్బందులు పడుతున్న 450 కుటుంబాలను పవన్ కళ్యాణ్ పెద్ద మనసుతో ఆదుకున్న ఘనత ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో టిడ్కో ఛైర్మన్ ఉదయ్ కుమార్, ఎమ్ఎస్ఎమ్ఇ ఛైర్మన్ శివశంకర్, తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్విని, బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్‌వర్మ, జనసేన నాయకులు వసరావు, పడాల అరుణ, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం మాధవి

# నీటిగుంతలతో రైతులకు మేలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

రైతులు తమ పొలాల్లో నీటి గుంతలు ఏర్పాటు చేసుకుంటే ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని చినరావాడ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో మంజూరైన ఫారం ఫాండ్‌కు శనివారం సాయంత్రం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గుంతల్లో నీరు నిల్వ ఉంటే పశువులకు, తోటల పెంపకానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రావాడ గ్రామం నుంచి చినరావాడ గ్రామానికి తారు రోడ్డు మంజూరు చేయాలని మాజీ ఎఎంసి ఛైర్మన్ దంతులూరి సూర్యనారాయణ రాజు ఎమ్మెల్యేను కోరారు. ఈ గ్రామానికి రోడ్డు వేస్తానని ఎలక్షన్లో హామీ ఇచ్చినందున తప్పకుండా మంజూరు చేయిస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎ.పైడినాయుడు, ఎపిడి పద్మజ, ఎంపిడిఒ గాయత్రి, ఎపిఒ భాగ్యలక్ష్మి, నాయకులు మట్టా అయ్యప్ప రెడ్డి, కొండపు రాధాకృష్ణ, వందనాల రమణ, సీతంనాయుడు, కిరణ్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఫారం పాండ్‌లతో ఎంతో ఉపయోగం**

**పూసపాటిరేగ:** ఫారంపాండ్‌లతో రైతులకు ఎంతో ఉపయోగమని నడిపల్లి సర్పంచ్ లంకలపల్లి గాయత్రి అన్నారు. శనివారం మండలంలోని నడిపల్లిలో రైతులు పంటపొలాల్లో రెండు ఫారంపాండ్‌లను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీల్డు అసిస్టెంట్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ తమ పంచాయతీలో తొమ్మిది బై తొమ్మిది పారంపాండ్‌లు తవ్విస్తున్నామన్నారు. దీని వల్ల వర్షాకాలంలో నీటి నిల్వ ద్వారా పక్కనే ఉన్న పంటలకు ఉపయోగం అన్నారు. నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు ఉన్నారు.

# ఫారం పాండ్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరంకోట, లక్కవరపుకోట

రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి , పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సూచన మేరకు శనివారం విజయనగరం మండలం రీమాపేటలో ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి, లక్కవరపుకోట మండలంలో ఫారం పాండ్ పనులకు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పొలంలో ఇంకుడు గొయ్యలు తవ్వడం వల్ల చెట్లకు, మొక్కలకు, పంట పొలాలకు నీరు సంవృద్ధిగా లభిస్తుందన్నారు. దీనివల్ల రైతు లాభదాయకమైన పంటలను విస్తారంగా సాగు చేసేందుకు వీలుంటుందని చెప్పారు. నీటి ఎద్దడి తగ్గించడంతో పాటు, భూ తాపాన్ని తగ్గించడంలో ఉపయోగపడ తాయని తెలిపారు రీమాపేటలో టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు. లక్కవరపుకోటలో జరిగిన కార్యక్రమంలో ఎపిఒ విజయలక్ష్మి, టిడిపి సీనియర్ నాయకులు మల్ల రామకృష్ణ, నీటి సంఘం అధ్యక్షులు సంఘం సతీష్, పొట్ట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

# ఇలాంటి అధికారిని ఎప్పుడూ చూడలేదు

**మండల సమావేశంలో పిఆర్ జెఇపై సభ్యుల ఆగ్రహం**

ప్రజాశక్తి-వేపాడ

పంచాయతీరాజ్ జెఇ ఆలీ పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి అధికారిని ఎప్పుడూ చూడలేదంటూ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి డి.సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు శాఖా పరంగా చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పిఆర్ జెఇ ఆలీ ఇచ్చిన సమాచారంపై అధికార, ప్రతిపక్ష సభ్యులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి జెఇని తాము ఎన్నడూ చూడలేదంటూ ఆయన పనితీరును తప్పుబట్టారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఎఇ బిక్కమొహం వేశారు. బానాది ఎంపిటిసి గొంప తులసి మాట్లాడుతూ పిఆర్ జెఇ చెప్పిన మాటల్లో ఒక్కటీ సరిగా లేదన్నారు. కొంతమంది సభ్యులు మాట్లాడుతూ సర్పంచుల ప్రమేయం లేకుండా గ్రామాల్లో ఎలా ఉపాధి హామీ పనులు చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. వెండర్ విధానంలో పనులు చేస్తే సర్పంచ్‌కు ఏం విలువ ఉంటుందని నిలదీశారు. అలాంటప్పుడు ఈ సమావేశాలు, గ్రామసభలు ఎందుకని ఎంపిపి సత్యవంతుడు.. ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిటిసి గొంప తులసి మాట్లాడుతూ వెండర్ విధానం తీసుకొచ్చింది గత వైసిపి ప్రభుత్వమేనని లేవనెత్తారు. దీంతో సమావేశంలో కొంతవరకు గందరగోళం నెలకొంది. అనంతరం రామస్వామిపేట, సింగరాయి, జగ్గయ్యపేట సర్పంచులు మాట్లాడుతూ పిఆర్ జెఇ ఆలీపై, క్వారీల నిర్వహణపై దర్యాప్తు చేపట్టాలని కోరారు. పంచాయతీలకు ఆదాయం రాకుండా గండికొడుతున్న క్వారీ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసిపి సభ్యులు ఎంపిపిని కోరారు. ఎంపిపి స్పందిస్తూ క్వారీ యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి, లైసెన్సులు లేని క్వారీలపై చర్యలకు సిఫార్సు చేయాలని తహశీల్దార్ రాములమ్మను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎంపిటిసి వి.వి.చినరామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బానాది ఎంపిటిసి తులసి

## వాహనదారులకు బిఎస్6 పై అవగాహన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద హీరో షోరూం ఈ నెల 21, 22, 23 తేదిల్లో నిర్వహిస్తున్న మెగా సేల్స్ అండ్ ఎక్సేంజ్ కార్నివాల్‌లో రెండో రోజు శనివారం ద్విచక్ర వాహన దారులు కార్నివాల్‌లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తమ వాహనాల సర్వీస్ తదితర అంశాలను ప్రత్యేకమైన ఇంజినీర్ల సమక్షంలో సర్వీస్ చేస్తున్నారు. రెండో రోజు బిఎస్6 వాహనాలపై వాహన దారులకు పూర్తి అవగాహన కల్పించారు. బిఎస్ 6 వాహనాలు ఆగిపో తున్నాయని అపోహ వినియోగదార్లలో ఉందన్నారు. ఎందుకు వాహనం ఆగుతుందో తెలుసుకోవాలన్నారు. బిఎస్6 వాహనాలు సెన్సార్‌తో పనిచేస్తాయన్నారు. కేవలం క్లచ్ మూమెంటు వల్ల బండి ఆగిపోతుందన్నారు. క్లచ్‌మీద చెయ్యివేస్తే మీరు గేరు మారుస్తారని సెన్సార్ గ్రహిస్తుందన్నారు. అయితే మీరు గేర్ మార్చకపోతే వాహనం ఆగిపోతుందన్నారు. బిఎస్6కి అలవాటుపడాలన్నారు. ద్విచక్ర వాహనాలకు సంబందించి ఆయిల్ వాడకం, టైర్లలో గాలి, హెడ్‌లైట్, కార్పెటర్ మెయింట్‌నెన్స్, టైర్ల్, ట్యూబ్‌లు, ఇంజన్ ఆయిల్ ఇలా అనేక విషయాలను ఇంజనీర్లు తెలియజేశారు. సకాలంలో సర్వీసు చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు వాహనదారులు కార్నివాల్‌లో పాల్గోవాలని హీరో షోరూం నిర్వాహకులు కె.చినబాబు తెలిపారు. కార్నివాల్‌లో పాల్గొన్న వాహనదార్లుకు బహుమతులు అందజేస్తున్నారు. వాహనదార్లుకు ఆరోగ్య పరీక్షలతో పాటు ఉల్లాసంగా ఉండేందుకు ఎంటర్‌టైన్మెంట్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేశారు. ఆదివారంతో కార్నివాల్ ముగియనుందని, హీరోతో పాటు ఇతర కంపెనీల వాహనాలకు కూడా ఎక్సేంజ్ అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రతి వాహనం కొనుగోలుపై 5000 వరకూ డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. వాహనాన్ని బట్టి మరిన్ని బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు వివరించారు.

బైక్‌లు సర్వీసింగ్ చేస్తున్న ఇంజినీర్లు

## కె.కొత్తవలస విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-దత్తిరాజేరు

జనవిజ్ఞానవేదిక ఆన్‌లైన్‌లో నిర్వహించిన యూరేకా ఎక్స్‌పో-2025 షార్ట్‌ఫిల్మ్ పోటీలలో కె.కొత్తవలస ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 'మూఢనమ్మకాలు విడనాడుదాం- శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకుందాం' అనే అంశంపై కె.ఏకాంత్ ఈశ్వర్, బి.దుర్గాప్రసాద్, యు.హరికృష్ణ తీసిన లఘుచిత్రం రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. వీరికి గైడ్‌గా ఉపాధ్యాయులు ఎస్.రవీంద్ర వ్యవహరించారు. ఈ నేపథ్యంలో శనివారం విద్యార్థులను, గైడ్ టీచర్ రవీంద్రను యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి అభినందించారు. వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పి.రాంప్రసాద్, కిల్లాడ అప్పారావు, ప్రధానోపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయులు సత్తిబాబు, వి.శ్రీరామ్మూర్తి, డి.రామకృష్ణ, ఎస్.చంద్రశేఖరరావు, ఎల్.వాసుదేవరావు, జి.గణపతిరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని సత్కరించి, విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

## వడదెబ్బపై ఉపాధి కూలీలకు అవగాహన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కాగితాపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఎంపిడిఒ శ్యామల కుమారి పరిశీలించారు. వడదెబ్బపై కూలీలకు అవగాహన కల్పించి ఒఆర్‌ఎస్ ప్యాకెట్లలను ఎంపిడిఒ, బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి రాధాకృష్ణ పంపిణీ చేశారు. వడదెబ్బకు ఎక్కువగా 60 ఏళ్ల వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలు, అనారోగ్యంతో బాధపడిన వారు, రక్తపోటు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోజుకు కనీసం 15 గ్లాసులు నీరు తాగాలని తెలిపారు. బయటకు వెళ్ళినప్పుడు ప్రయాణాలు చేసినప్పుడు తప్పనిసరిగా టోపీ, మంచినీరు తీసుకుని వెళ్లడం మంచిదని చెప్పారు. వీరితోపాటు ఆరోగ్య కార్యకర్తలు నాగమ్మ, హైమా, ఎంఎల్‌హెచ్‌పి సౌజన్య, ఆశ కార్యకర్త రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్లకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, చట్టబద్దమైన సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు శనివారం డిఎంహెచ్ఒ జీవనరాణికి వినతి పత్రం అందజేశారు. పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్స్‌ని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, ఇతర సౌకరక్యాలను కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో చాలా మంది ఆశా వర్కర్లు అర్ధాంతరంగా చనిపోతు న్నారని, ప్రభుత్వం ఆశా వర్కర్స్‌కు గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్సు ఆశాలుగా మార్పు చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు బి.సుధారాణి, గౌస్య ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## 38 కేంద్రాల్లో 1830 మందికి పరీక్ష

ప్రజాశక్తి - నెల్లిమర్ల

38 కేంద్రాల్లో 1830 మంది వయోజనులకు అక్షరాస్యత పరీక్ష నిర్వహించనున్నామని ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వయోజనులైన అక్ష్యరాస్యులకు ఈ నెల 23న జరగనున్న ఫౌండేషన్ లీటరసి, న్యూమరసి ఎసెస్మెంట్ టెస్ట్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంతవరకు చదవడం, రాయడం, లెక్కలు వేయడం నేర్చుకున్న వయోజనులకు వారి పురోగతిపై ఆదివారం పరీక్ష నిర్వహిస్తామన్నారు. 1830 మందికి పరీక్షలు ఆయా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో జరుగుతాయని పాసయిన వారికి జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ ధ్రువీకరణ పత్రం అందజేస్తుందని తెలిపారు. సమావేశంలో వెలుగు ఎపిఎం ఎస్‌విడి సురేష్, ఇఒపిఆర్‌డి శంకర జగన్నాథం, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు బి.శారద, త్రినాధమ్మ, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

**పరీక్షా నిర్వహణకు అవగాహన సమావేశం**

**డెంకాడ:** స్థానిక వెలుగు మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ అసెస్మెంట్ ఎగ్జామ్ నిర్వహణకు సంబంధించి అవగాహన నిర్వహించారు. ఇన్విజిలేటర్లు, వాల్యుయేటర్లుగా బాధ్యతలు స్వీకరించిన అంగన్వాడీ టీచర్లు, పరీక్ష మానిటరింగ్ బాధ్యతలు నిర్వహించే విఒఎలకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీచేశారు.

## జెడ్‌పి ఛైర్మన్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పుత్రశోకంతో ఉన్న జిల్లా పరిషత్ ఛైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావుకు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం పరామర్శించారు. ఆయన రెండో కుమారుడు ప్రణీత్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో చిన్నశ్రీనును పరామర్శించి ప్రణీత్‌చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయనను కలసి వారిలో మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు , పడాల అరుణ, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, శ్రీకాకుళం జెడ్‌పి ఛైర్మన్ పిరయ విజయ, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్, పలు రాజకీయ పార్టీల నాయకులు పాలవలస యశస్విని, పేడాడ తిలక్, దువ్వాడ వాణి , ఎచ్చర్ల కిరణ్ , డోల జగన్ , కోరాడ రాజబాబు, కడగల ఆనంద్‌కుమార్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం తదితరులు ఉన్నారు.